క్లుప్తంగా

శివయ్యకు గ్రామోత్సవం


నంది వాహనంపై ఊరేగుతున్న శివయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ వేడుకలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని నంది వాహనంపై క్షేత్ర పురవీదుల్లో అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్‌కు సత్కారం


గంగాధర్‌ను సన్మానిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎల్‌వీవీ గంగాధర్‌రావు ఉత్తమ డిపో మేనేజర్‌గా ఎంపికై అవార్డు తీసుకున్న సందర్భంగా సోమవారం ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రంగనాయకులు, రీజినల్ జాయింట్ సెక్రెటరీ దుర్గారావు, డిపో సెక్రటరీ సీహెచ్ ఎస్ నారాయణ, జోనల్ ఆపరేటింగ్ సభ్యుడు ఎం.శ్రీనివాస్, ఎంఎస్ నారాయణ, బీవీ రావు లక్ష్మణరావు, చిన్నయ్య, సభ్యులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం


పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్న పశువైద్య సిబ్బంది

కామవరపుకోట: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం స్థానిక పాతూరు పాలకేంద్రం ఆవరణలో మండల పశువైద్యాధికారి ఆదిత్యకుమార్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. దూడల్లో ఏలిక పాముల నిర్మూలన, ఆవశ్యకతతో పాటు కోళ్లకు సంబంధించి వ్యాధుల నివారణలో మెళకువలు వివరించారు.

బైండోవర్

కుక్కునూరు: సారా అమ్మకాలు, తయారీ నిందితులు 19 మందిని సోమవారం తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అక్రమ మద్యం నిల్వలు, అమ్మకాలు జరిగినా, బెల్లపు ఊటలు, సారా తయారీ కేంద్రాలు, సారాయి విక్రయాలు జరుగుతున్నా తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తాండ్ర పాపారాయుడుకు ఘన నివాళి


పాపారాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతలపూడి: స్థానిక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాండ్ర పాపారాయుడు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని వెలమపేటలో ఉన్న పాపారాయుడి విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు అర్నేపల్లి అప్పారావు మాట్లాడుతూ బొబ్బిలి యుద్ధంలో పాపారాయుడి వీరోచిత గాథలను వివరించారు. బోసు ఉమామహేశ్వర్రావు, పెద్దిరెడ్డి సోంబాబు, వేములపల్లి రామారావు ,చింతల ఉమామహేశ్వరరావు, బోధల శ్రీనివాసరావు, వంగపండు విశ్వేశ్వర్రావు, డి రాము, మెరపల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే సమగ్రంగా ఉండేలా చూడాలి

బుట్టాయగూడెం: రాజానగరంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూముల రీసర్వే పనులను సమగ్రంగా నమోదయ్యేలా చూడాలని తహసీల్దార్ పీవీ చలపతిరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వీఆర్‌ఓలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రీసర్వే పనులతోపాటు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా!

- కల్వర్టు కొట్టుకుపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- తరచూ ప్రమాదాలబారిన పడుతున్న ప్రయాణికులు


గాయాలపాలైన ద్విచక్ర వాహనదారుడు చుంద్రు బాలాజీ


కల్వర్టులో పడిన ద్విచక్ర వాహనదారుడిని బయటకు తీస్తున్న స్థానికులు

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం సమీపంలో ఉన్న కల్వర్టు అక్టోబర్ నెలలో కురిసిన వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయింది. దీనితో రెడ్డిగణపవరం వెళ్లేందుకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కల్వర్టు కొట్టుకుపోయి 4 నెలలు కావొస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. కాల్వ ప్రవాహాలు తగ్గినప్పటికీ అక్కడ వాహనాలు తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే దెబ్బతిన్న కల్వర్టు వద్ద కనీసం హెచ్చరిక బోర్డులను కూడా పెట్టకపోవడంతో అనేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కొత్తగా ఈ రహదారిలో ప్రయాణం చేసేవారు ఆ కాల్వలో పడి గాయాలపాలవుతున్నారు. సోమవారం రాత్రి కూడా జీలుగుమిల్లి నుంచి వెళ్తున్న కొయ్యలగూడెంకు చెందిన ఒక యువకుడు ద్విచక్రవాహనంపై ప్రయాణంచేస్తూ ప్రమాదంగా ఉన్న కల్వర్టులో పడి గాయాలపాలయ్యాడు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంలో రూ.లక్షా 50 వేలు సొమ్ము ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. అయితే అతడిని స్థానికంగా ఉన్న కొందరు యువకులు సహాయం చేసి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అలాగే తడిసిపోయిన సొమ్ములనుకూడా అందజేశారు. కొట్టుకుపోయిన కల్వర్టుపై పెద్ద వాహనాలు ప్రయాణం చేయకపోవడంవల్ల స్కూల్ పిల్లలు సైతం అవస్థలు పడుతున్నారు.

నేషనల్ హైవేగా రెడ్డిగణపవరం రహదారి

బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం రహదారి జాతీయ రహదారి 365బీబీగా మార్చడం జరిగింది. 2021లో అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హైవే అధికారులతో మాట్లాడి హుటాహుటిన కల్వర్టు మరమ్మతు పనులు చేయించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చేశారు. ప్రస్తుతం రెడ్డిగణపవరం సమీపంలో కల్వర్టు కొట్టుకుపోయి 4 నెలలు గడుస్తున్నా హైవే అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాల నివారణతోపాటు రహదారి ఇబ్బంది కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఇప్పటికైనా కల్వర్టు నిర్మించాలి



వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయి 4 నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఈ రహదారిపై కొత్తగా ప్రయాణం చేసేవారు అనేక మంది కల్వర్టులో పడి గాయాల పాలవుతున్నారు. కొద్దిరోజుల వరకూ అక్కడ తాడు, ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి కూడా లేకపోవడంతో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికైనా కల్వర్టు మరమ్మతు పనులు చేయించాలి.

– కోర్సా జలపాలు, రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం మండలం

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి


మహాసభలో ప్రసంగిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య

చింతలపూడి: నగర పంచాయతీల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చింతలపూడి పట్టణ సీపీఐ శాఖ మహాసభ సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఎస్కే కాలేషా అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ జెండాను ఎస్కే కాలేషా ఆవిష్కరించారు. మహా సభలో పలు తీర్మానాలను ఆమోదించారు. మహాసభలో మండల కార్యదర్శి గురవయ్య మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో గ్రామీణ పేదలు ఇంకా పేదలుగానే ఉన్నారని వీరికి ఉపాధి పని లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చింతలపూడిలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తీర్మానించారు. అనంతరం చింతలపూడి శాఖ కార్యదర్శిగా ఎస్కే జానీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు ఎస్కె కాలేషా నర్సింగ రామారావు, ఆహ్వానితులుగా తాడిగడప మాణిక్యాలరావులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ భవనాలు వినియోగంలోకి తీసుకురావాలి


అచ్యుతాపురంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వం నిర్మించిన భవనాలు పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచ్ మద్దిపాటి నాగమణి కోరారు. సోమవారం కొయ్యలగూడెం మండల పశు వైద్య శాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అచ్చుతాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సచివాలయ భవనాలు, వెల్నెస్ సెంటర్స్, రైతు భరోసా కేంద్రాలు ప్రతి గ్రామానికి అవసరమని, కొన్నిచోట్ల ఆ భవనాలు అసంతృప్తిగా నిలిచిపోవడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్నారు. పశువైద్య శిబిరంలో అరవై పశువులకు ఔషధాలు అందించారు. ఐదు పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి చికిత్స చేశారు. నాని కోరం ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ తెల్లం నవీన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, పశుసంవర్ధక సహాయకులు కె.వెంకటేశ్వరావు, పి.సాయిరాం, కార్యాలయ సహాయ కార్మికులు టి.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలతో ప్రతిభకు వన్నె


జంగారెడ్డిగూడెం: ఏపీఈపీడీసీఎల్ డీఈ సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: అధికారులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ నేతలు


లింగపాలెం: ఈవోపీఆర్డీ రత్నకుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ సిబ్బంది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి సోమవారం ఆయా కార్యాలయాల్లో సిబ్బంది, నేతలు అభినందనలు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ డీఈ యు.సుబ్బారావు పురస్కారం అందుకున్న సందర్భంగా లైన్ ఇనెస్పెక్టర్ ఎంవీవీఎస్‌వీఎన్ మూర్తి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ అవార్డులు ఉద్యోగ బాధ్యతలను మరింత పెంచుతాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. లైన్‌మన్‌లు ఎం.రాము, సీహెచ్ శ్యామ్‌బాబు, ఎ.మనోహర్, జేఎల్ఎం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పురస్కారాలు కొలమానం

కొయ్యలగూడెం: ఉద్యోగంలో కనబరిచే ప్రతిభకు ప్రభుత్వం అందించే పురస్కారాలు కొలమానంగా నిలుస్తాయని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీటీసీ బిరుదుగడ్డ రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి అవార్డులు అందుకున్న తహసీల్దార్ కె.చెల్లన్నదొర, ఆర్ఐ తురసం మణి దివ్య రాజేష్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పసుపులేటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా రమేష్, మండపాటి రామకృష్ణ, పాముల నాగమునిస్వామి, బిరుదుగడ్డ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పంచాయతీరాజ్ భవనంలో పంచాయతీరాజ్ డీఈ నీలం సీతయ్య, ఏఈ సురేష్‌ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఐవీ అప్పారావు, ఎం.సోమేశ్వరరావు, గూటాల నాని, బూసి త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం: ఈవోపీఆర్డీ జేఎం రత్నకుమార్‌ను అవార్డు అందుకున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అధికారులు గ్రామ సెక్రటరీలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీమ్, ఎంపీడీవో వాణి, ఎంఈఓ రామారావు, పంచాయతీరాజ్ ఏఈ జగన్నాధరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముసునూరు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


చింతలపూడి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 1968-69 బ్యాచ్ ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు

చింతలపూడి: చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 1968-69 ఎస్ఎస్ఎల్‌సి అరేయ్, ఒరేయ్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 57 సంవత్సరాల తరువాత కలుసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావడం విశేషం. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులను, ఆనాటి స్మృతులను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా సాయంత్రం వరకు ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని తీర్మానించారు. కార్యక్రమంలో నంబూరి ప్రసూనాంబ, గోపవరపు వెంకటేశ్వరరావు, ఎండీ ఆలీ, మొండి శ్రీరామచంద్రరావు, మంత్రి నాగేశ్వరరావు, పాకా సర్వేశ్వర్రావు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

లింగపాలెం: పురుగుమందుల షాపులపై విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. మండలంలోని శ్రీసాయిట్రేడర్స్, రామాజంనేయ ట్రేడర్స్‌లో తనిఖీలు చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉన్న పురుగుమందులు గుర్తించి అమ్మకాలను నిలుపుదల చేశారు. విజిలెన్స్ ఏఈవో జి.మీరయ్య మాట్లాడుతూ సాయిట్రేడర్స్ నందు రూ.1,51,725 విలువైన కలిగిన 10 లీటర్ల పురుగుమందులు, రామాంజనేయ ట్రేడర్స్‌లో రూ.84,278 విలువైన 7 లీటర్ల పురుగుమందులకు సరైన రికార్డులు లేవని, వీటి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, విజిలెన్స్ ఎస్సై కె.సీతారాము, మండల వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

కుక్కునూరు: చీరవల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను, స్టిక్కర్ క్యాలెండర్‌ను జెడ్పీహెచ్ఎస్ చీరవల్లి పీజీ హెడ్మాస్టర్ టీవీఆర్‌జీ భవాని, రాష్ట్ర కౌన్సిల్ కారం ధారయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ త్వరలో ప్రకటించే డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20 ఉండేలా పోస్టులు ప్రకటించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో భౌగోళిక విధంగా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రతి పాఠశాలలోని కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు పనిచేసే విధంగా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పూనెం సీతారామయ్య, మండల అధ్యక్షులు సోడా వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి తుర్సమ్ వినోద్ కుమార్, తెల్లం వెంకట్, రాస లక్ష్మణ్ రెడ్డి, గుజ్జ ఇమ్మానుయేలు, వెట్టి నాగేంద్ర ప్రసాద్, తాటి బాలరాజు, రావుల శ్రీహరిబాబు, మడకం భీమరాజు గారు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు: వలస గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ పార్టీ కుక్కునూరు మండల సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు రహదారుల సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా తాగునీటి సౌకర్యం లేక కలుషిత నీరు తాగి వలస గిరిజనులు రోగాల బారిన పడి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. వలస గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలతో పాటు కుల ధృవీకరణ పత్రాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా కుక్కునూరు ప్రధాన రోడ్డు మరమ్మతు చేయాలని కోరారు. అనంతరం కుక్కునూరు తహసీల్దార్ రమేష్ బాబుకి వినతి పత్రం అందజేశారు. ఏలూరు జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు, జోగేష్, సోమయ్య, సోడే రమేష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్లకు భద్రత కల్పించాలి

జంగారెడ్డిగూడెం: థామా అల్వా ఎడిషన్ బల్బును కనుగొన్న తర్వాత మనిషి జీవన విధానం అభివృద్ధిలో చాలా వేగంగా ముందుకు వచ్చిందని, ఇది మానవ సమాజంలోనే ఒక కీలకమైన దశ అని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ అన్నారు. సోమవారం నేషనల్ ఎలక్ట్రికల్ డే సందర్భంగా సోమవారం స్థానిక ధర్మన్న స్మారక భవనం వద్ద జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ జరిగింది. సభలో యూనియన్ జనరల్ సెక్రెటరీ బాలిన ధర్మరాజు, కేవీ రమణ మాట్లాడారు. నిత్యం ఆపాయలతో నిండుకున్న ఎలక్ట్రికల్ వర్కర్‌ల రక్షణ కోసం ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ కట్టాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వారు చనిపోతే కుటుంబాన్ని పూర్తిగా ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

మీకోసంలో 9 అర్జీలు

జంగారెడ్డిగూడెం: పీజీఆర్ఎస్ (మీకోసం) కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కారించేలా చర్యలు చేపట్టాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. వాటిలో విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తోందని, తన భూమికి ప్రొటెక్షన్ ఆర్డర్ ఇప్పించాలని, తన భూమిలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని, భూమికి పట్టా ఇవ్వాలని, తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకున్నారని న్యాయం చేయాలని తదితర సమస్యలతో ప్రజలు వినతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటం

ద్వారకాతిరుమల: పేదల పక్షాన సీపీఐ ఎప్పుడూ అలుపెరుగని పోరాటం చేస్తుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు అన్నారు. తిమ్మాపురంలో సీపీఐ మండల నూతన శాఖ సమావేశం కార్యదర్శి యడ్లపల్లి రమేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా వెంకటేశ్వరరావు సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి గోలిమే బాలయేసు మాట్లాడుతూ మండలంలో పేద ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఐ క్రియాశీలకంగా పనిచేస్తుందన్నారు. తిమ్మాపురంలో ఇండ్ల స్థలాలు లేని పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇచ్చి, గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని, గ్రామంలో మంచినీరు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యాలతో పాటు, రోడ్లు నిర్మించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పెండ్లి భూషణం, తవిటికూటి వెంకటేశ్వరరావు, కొప్పుల రామకృష్ణ, ఉండి దుర్గారావు, ఉండి మార్తమ్మ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: కొమ్మరలో సోమవారం నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 6 గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8,800 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.